క్లుప్తంగా

విషజ్వరాలు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న గాంతుల మహేశ్

సిరిసిల్లటౌన్: జిల్లాలో విషజ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటివి ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వీటిపై నియంత్రణ ఉంచాలన్నారు. అన్ని గ్రామాలల్లో, మొబైల్ టీమ్‌ల ద్వారా వైద్య క్యాంపులు ఏర్పాటుచేయాలన్నారు.

అధిక దిగుబడి సాధించాలి



బోయినపల్లి: రైతులు సాగులో సాంకేతిక పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని మాన్వాడలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేసి లాభాలు పొందాలన్నారు. మోతాదుకు మించి యూరియా వాడొద్దన్నారు. పంటల తెగుళ్లకు రసాయన ఎరువులు, పురుగు మందులు సూచించిన మోతాదులో వాడాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎం.సంపత్‌కుమార్, కే.భవ్యశ్రీ, ఎంఏవో కే.ప్రణీత, మండల ఉద్యాన అధికారి సీహెచ్. లోకేశ్, ఆయిల్‌పామ్ సాగు ప్రతినిధులు ప్రేమ్‌సాయి రెడ్డి, శ్రీకాంత్, ఏఈవో రవళి, విద్యార్థినులు జాస్మిన్, ముఖేశ్ రైతులు, తదితరులున్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



వీర్నపల్లి: రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి జయ తెలిపారు. గురువారం రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. మండలంలోని మహిళా సంఘం కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, మండలానికి 49 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ ముక్తార్ పాషా, మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ వాజిద్, ఆర్ఐ శివకుమార్, మండల సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఏపీఎం నర్సయ్య మాజీ ఎంపీటీసీ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



ముస్తాబాద్: వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని సీడీపీవో ఉమారాణి అన్నారు. మండలంలోని ఆవునూర్, రామలక్ష్మణపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ప్రీస్కూల్ విద్యార్థులను గుర్తించి కేంద్రాల్లో చేర్చుకోవాలన్నారు. అలాగే గర్భిణుల నమో దు, పోషకాహారం క్రమం తప్పకుండా అందేలా చూడాలన్నారు. కేంద్రాల్లోని టీచర్లు, ఆయాలు పారదర్శకంగా పనిచేయాలన్నారు. జూన్‌లో బడిబాటను విజయవంతం చేయాలని కోరారు. సూపర్‌వైజర్ అంజలి, అంగన్‌వాడీ టీచర్ భైరి పద్మ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

రుద్రంగి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. గురువారం ఆయన నాయకులతో కలిసి మండల కేంద్రంలోని ఒడ్డెరకాలనీ నుంచి శ్మశానవాటిక వరకు ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, కేసిరెడ్డి న ర్సారెడ్డి, రత్నం, కుమార్, నవీన్, గంగాధర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కలగానే కల్వర్టుల నిర్మాణం!



కోనరావుపేటలో సైడ్‌వాల్ లేని కల్వర్టు



మల్కపేటలో ఒర్రె వద్ద వాహనదారుల ఇబ్బంది (ఫైల్)

- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న కల్వర్టుల నిర్మాణం
- ఏటా వానాకాలంలో వాహనదారుల తిప్పలు
- పట్టించుకోని అధికారులు

కోనరావుపేట: మండలంలోని పలుగ్రామాల మధ్య ఉన్న ఒర్రెలు ప్రమాదకరంగా మారాయి. వానా కాలం వస్తే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో కాజ్‌వేలు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరుకాకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

ఏటా తిప్పలు

కోనరావుపేట మండలంలోని మల్కపేట, ధర్మారం ,కోనరావుపేట, వట్టిమల్ల, కొండాపూర్ తదితర గ్రామాలకు వెళ్లేదారిలో ఒర్రెలు ఉన్నాయి. ఏటా వర్షాలకు ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్ని గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. మల్కపేటలో రెండు ఒర్రెలు, ధర్మారంలో ఒకటి ఉన్నాయి. వీటితో పాటు వట్టిమల్లకు వెళ్లేదారిలో ప్రధాన రహదారిపై ఒర్రె లున్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

మండలంలోని గ్రామాల్లో ఉన్న ఒర్రెలతో మండల ప్రజలు కొన్నేళ్లుగా అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఒర్రెలవద్ద నిర్మించ తలపెట్టిన కాజ్‌వేల కోసం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో ఒర్రె వద్ద కాజ్‌వే నిర్మించేందుకు సుమారు రూ.20 లక్షల పైనే ఖర్చవుతుంది. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపి ఏడాదవుతున్నా ఇప్పటివరకు ఒక్క పనికి కూడా నిధులు మంజూరుకాలేదు. ఒక్క మండలకేంద్రంలో కల్వర్టుకు రూ.32 లక్షలు మంజూరైనా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. బైపాస్ రోడ్డులో మరో వంతెన కోసం పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పనులు కార్యరూపం దాల్చడం లేదు. దీంతో మండలకేంద్రానికి వచ్చే ప్రజలు, సిరిసిల్లకు వెళ్లే వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వర్షాకాలం వస్తే ఒర్రెల్లో నీరు పారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే సిరిసిల్ల–కోనరావుపేట ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభిస్తున్నాయి. దీంతో మండలానికి వచ్చే అధికారులు, ప్రజలు ఏటా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారుల సమస్యలు తొలగించాలి.

– గొట్టె లక్ష్మణ్, కోనరావుపేట

ప్రతిపాదనలు పంపాం

కోనరావుపేట మండలంలో కొండాపూర్ స్టేజీవద్ద ఉన్న ఒర్రె, కోనరావుపేట శివారులో మరో ఒర్రె ఉంది. మిగతా గ్రామాల్లో ప్రధాన రహదారిపై ఉన్న ఒర్రెలపై కాజ్‌వేల నిర్మాణానికి నిధులు మంజూరుకోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరుకాలేదు. వీటికి నిధులు మంజూరు అయితే వెంటనే పనులు ప్రారంభించేలా చూస్తాం. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– నవ్యశ్రీ, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



బోయినపల్లి: అనంతపల్లిలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రవిశంకర్, తదితరులు

బోయినపల్లి: రైతులు పండించిన ధాన్యాన్ని ఎప్పుడు కొంటారో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని అనంతపల్లి గ్రామ ప్యాడీ సెంటర్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీలు రాక కాంటా వేయక అకాలవర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తిందన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాయకులు గుంటి శంకర్, నిమ్మ శ్రీనివాస రెడ్డి, చిందం రమేశ్, మహ్మద్ అజ్జూ, బత్తిని కమల్, ముద్దం రవి తదితరులు ఉన్నారు.

‘విప్‌ను విమర్శించే స్థాయి ఆగయ్యకు లేదు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: అధికారం పోవడంతో తోట ఆగయ్య మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, ఏఎంసీ డైరెక్టర్ సూడిద రాజేందర్ విమర్శించారు. మండలకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రొటోకాల్ విషయంలో కేకే మహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుడు తోట ఆగయ్య లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో తొమ్మిదేళ్లపాటు అధికారులు, మంత్రితో సభలు, సమావేశాల్లో పాల్గొన్నాడని ప్రశ్నించారు. సీఎంను, ప్రభుత్వ విప్‌లను విమర్శించే స్థాయి తోట ఆగయ్యకు లేదన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు మెండె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

‘ప్రొటోకాల్‌పై కాంగ్రెస్ నేతలది అజ్ఞానం’



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రొటోకాల్‌పై ఏమీ తెలియని అజ్ఞానులు కాంగ్రెస్ నేతలు అని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ విమర్శించారు. మండలకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ప్రజల మద్దతుతో నాలుగు సార్లు ప్రజాప్రతినిధిగా ఉన్న విషయాన్ని మరిచి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ప్రొటోకాల్ గురించి అధికారులను అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నేత సీత్యానాయక్ మాట్లాడుతూ తోట ఆగయ్య జిల్లా అధ్యక్ష స్థానంలో ఉన్నాడనే సోయిలేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అజ్మీరా తిరుపతినాయక్, ముష్కం పవన్, సుధాకర్ రావు, బాలునాయక్, తిరుపతినాయక్, జీడి శ్రీనివాస్, ఎలగందుల బాబు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలి

ముస్తాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దసరా నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో బీరయ్య కోరారు. మండలకేంద్రంలో లబ్ధిదారులతో గురువారం మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు గూడు కల్పించాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ఇంటి నిర్మాణ సమయంలో నాలుగు విడతల్లో రూ.5లక్షల ప్రభుత్వ సాయం అందుతుందన్నారు. లబ్ధిదారులు వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ సూపర్‌వైజర్‌గా అరవింద

ముస్తాబాద్: ముస్తాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా అరవింద బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట జిల్లాలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న అరవింద.. ముస్తాబాద్ సెక్టార్ సూపర్‌వైజర్‌గా డిప్యూటేషన్‌పై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్తాబాద్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు బాగ పనిచేయాలని కోరారు.

● నిరంతర విద్యుత్ అందించేందుకు కృషి

ఎల్లారెడ్డిపేట: మండలంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు అవసరం ఉన్న చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు బండారి బాల్‌రెడ్డి, శ్రీనివాస్, లింగంగౌడ్, గౌస్, సెస్ ఏఈఈ పృథ్వీధర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

● యోగాపై శిక్షణ

కోనరావుపేట: ప్రతి వ్యక్తి జీవితంలో యోగా ఒక భాగం కావాలని ఆయుర్వేద డాక్టర్ కల్యాణి అన్నారు. మండలంలోని నిజామాబాద్‌లో ×ఒకే భూమి, ఒకే ఆరోగ్యం కోసం యోగా॰ కార్యక్రమంలో భాగంగా యోగాపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీ య యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ యోగాపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు అశోక్, పుష్పలత, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

● గొర్రెల కాపరిపై నక్క దాడి

చందుర్తి: గొర్రెల కాపరిపై నక్క దాడిచేసి గాయపర్చిన ఘటన మండలంలోని జోగాపూర్ శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి చింతం అనిల్ రోజు మాదిరిగానే గొర్రెలను మేపేందుకు జోగాపూర్– ఎన్గల్ గ్రామాల మధ్య గల చేల్లోకి తీసుకెళ్లాడు. అనిల్‌ను నక్క వెనుక నుంచి వచ్చి చేతిపై దాడిచేసింది. వెంటనే స్థానికులు చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.

తొమ్మిది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామ శివారులోని దర్మావళి గుట్ట వద్ద అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్డును అధికారులు కూల్చివేసిన సందర్భంగా జరిగిన పరస్పర దూషణలతో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు తొమ్మిది మందిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సింగారం మాజీ సర్పంచ్ గొల్లపల్లి మల్లేశం , బీజేపీ పార్టీ నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుని ఒకరిపై ఒకరు అసభ్య పదజాలంతో దూషించుకున్నారు. అనంతరం ఇరువురు పరస్పర ఫిర్యాదులు చేసుకోగా రెండు వర్గాలకు చెందిన తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం సింగారంలో బహిరంగ విచారణ నిర్వహించారు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై లక్ష్మణ్ ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీకాంత్ గౌడ్

ఇల్లంతకుంట: యువత సన్మార్గంలో నడవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు. మండలంలోని కందికటూక్కర్‌లో గురువారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. యువకులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


హరితహారం చెట్లు నరికితే చర్యలు



లక్ష్మీపూర్‌లో నరికివేసిన హరితహారం చెట్లు

తంగళ్లపల్లి: మండలంలోని లక్ష్మీపూర్‌లో రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం చెట్లను ఓ వ్యక్తి గురువారం నరికివేయడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని హరితహారం చెట్లను నరికివేశాడు. కాగా విషయం ఎంపీడీవో కె.లక్ష్మీనారయణకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీవో మీర్జా అహ్మద్ అలీ బేగ్‌ను ఆదేశించారు. సదరు వ్యక్తికి గ్రామపంచాయతీ నుంచి నోటీసులు జారీచేశారు. హరితహారం చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



దేవరాజు (ఫైల్)

వేములవాడ: వేములవాడ ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు బత్తుల దేవరాజు(48) గురువారం గుండెపోటుతో మరణించారు. పది రోజుల క్రితం గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం.. రాచర్లబొప్పాపూర్‌లో వీధికుక్కలు ప్రజలు, చిన్నారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల కుక్కలదాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. రోడ్ల వెంట వెళ్లే వాహనదారుల వెంట పడడంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. బయట ఆడుకుంటున్న చిన్న పిల్లలపై తరచూ దాడులు చేస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి దాడులు చేస్తున్న కుక్కలను గ్రామం దాటించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
రాజు, కార్యదర్శి, రాచర్లబొప్పాపూర్, సెల్ నంబర్: 9912776782

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గుంటి వేణు

తంగళ్లపల్లి: సీపీఐ ఆధ్వర్యంలో జూన్ 13, 14న జిల్లాకేంద్రంలో నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి గుంటి వేణు పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా భారీ పరిశ్రమలు నిర్మించగా వాటితో కాలుష్యం ఏర్పడి శ్వాసకోశ వ్యాధులతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే ప్రజలతో కలిసి మూసివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసం లక్ష్మణ్, నాయకులు ఎలిగేటి రాజశేఖర్, సోమ నాగరాజు తదితరలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తిచేయాలి



ఎల్లారెడ్డిపేట : నారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు



కోనరావుపేటలో..

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమకు మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడుర దొమ్మాటి నర్సయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపూర్, అల్మాస్‌పూర్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈఈ చైతన్య, పంచా యతీ కార్యదర్శి జాఫర్, నాయకులు గౌస్, నా రాయణరెడ్డి, మహేందర్, మల్లారెడ్డి, పర్శరాములు, బాలయ్య, పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి, కోనరావుపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గురువారం అధికారులు, నాయకులు భూమిపూజ చేశారు. తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్ రెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఏఈ సాయిప్రియ, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్లు సాసాల మల్లారెడ్డి, లింబయ్య, కార్యదర్శులు సతీశ్, సాయి, నాయకులు ఎల్లాల రాంరెడ్డి, గొట్టె శంకర్, రుక్మిణి, గోపాల్, జూకొంటి మల్లేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని అన్నారు. మండలకేంద్రంలోని పలువురు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు. మండల మాజీ ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి మాట్లాడుతూ త్వరగా ఇందిరమ్మ ఇళ్లను పూర్తిచేసే లబ్ధిదారులకు రూ.10 వేలు చొప్పున పారితోషకం అందిస్తానన్నారు. ఎంపీవో మీర్జా అహ్మద్ అలీ బేగ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



వేములవాడ: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు



గంభీరావుపేటలో..

వేములవాడ: ఖరీఫ్ పంటలకు మద్దతు ధరపెంచిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ అనుబంధ సంస్థ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాపెల్లి శ్రీధర్, మామిండ్ల లక్ష్మీరాజం, కృష్ణస్వామి, అన్నం నర్సయ్య, బిల్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలో బీ జేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్, నాయకులు గంట అశోక్, పర్శరాం గౌడ్, రాజుగౌడ్, పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ మాట్లాడారు. కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేశ్, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, యెల్ల గిరిధర్ రెడ్డి, మెరుగు అంజాగౌడ్, రమేశ్‌రెడ్డి, మెంగని మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టె రామచంద్రం, నాయకులు జింక వెంకటి, బోయిని నర్సయ్య, కాసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాతబస్టాండ్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు రేపాక రామచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డిలు మాట్లాడారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు పారిపల్లి సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఎంపీవోగా అనిల్

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయ ఎంపీవోగా గాలిపెల్లి పంచాయతీ కార్యదర్శి ఏ అనిల్‌ను నియమిస్తూ గురువారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఉత్తర్వులు జారీచేశారు. ఎంపీవో శ్రీనివాస్ జూన్ 15 వరకు సెలవుపై వెళ్లడంతో అనిల్‌కు ఎంపీవోగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.